హేమచంద్ర సూరి

వేదము వేంకటరాయఁడు

౧

మన దేశమున మతములకును మత వివాదములకును ఎన్నడును కొఱత యుండినదిలేదు. జను లెందఱో మతములన్ని. పంద్రెండవ శతాబ్దమున నీవాదములు అతి తీవ్రముగా నుండినవి. హిందూ జైన బౌద్ధ మతములకు ఒరయిక బలముగా నుండెను. దేశమున నెచట చూచి నను నగరములలో పట్టణములలో గ్రామములలో పల్లె లలో ఎల్లమతముల వారును వాదములు చేయుచు వాద ములలో ఓడినవారు గెలిచినవారి మతముల నవలంబిం చుచు దినమునకొక మతముగా నుండిరి. ఒకమూల బౌద్ధుల ప్రచారము, మఱియొకమూల జైనులబోధలు మధ్య సనాతనుల యార్భాటములు చెలరేగుచుండినవి. రాజులు మతబోధకుల చేతి కీలుబొమ్మలుగా నుండిరి. ఆ స్థానములలో వాదబలముల మీఁదనే మతములు ఆధార పడియుండినవి. జైనాచార్యుఁడు గెలిచిన రాజు జైనుఁ డగును; బౌద్ధ పరివ్రాజకుఁడు గెలిచిన రాజు బౌద్ధుఁ డగును; బ్రాహ్మణుఁడు గెలిచిన రాజు హిందు వగును. మాటలమీఁదనే అంతయు నిలిచి యుండినది. రాజాశ్ర యమే మతములకు పట్టుకొమ్మ.

గుజరాత్ దేశమున దుంధూక మను ప్రదేశమున మోదవణిక్కుల జుఁడు శచీకుఁడని శ్రేష్ఠి యొకఁడు వసించుచుండెను. ఈతని భార్య పాహినీ యనునది జైనమత మవలంబించి యుండెను. ఈ దంపతులకు చంగదేవుఁడని కుమారుఁడు కలిగెను. చంగదేవునికి తృతీ యకులోచిత విద్యలను నేర్పుచు తండ్రి హిందువు ఇతర మతములచేత పడనీకుండ రక్షించుచుండెను. బాలునికి ఎనిమిదవ సంవత్సరము వచ్చినది. ఒకదినము తండ్రి గ్రామాంతరము పోయి యుండెను. అపుడు అకస్మా త్తుగా దేవచంద్రుఁడని జైనాచార్యుఁడు వారి యింటికి అతిథిగా వచ్చెను. పాహినీదేవి ఆయనను ఆదరించెను బాలుఁడు ఆయనకు సకలోపచారములను చేసెను. ఆ బాలుని సౌందర్యమునకును తేజమునకును బుద్ధి వికాసము నకును ఆయన సంతోషించి ఆ బాలుని తనవెంట పంపిన తాను విద్యనేర్పి జినదేవుని సూక్తులను బోధించి జైన మతావలంబకునిగా చేసెదననియు, బాలునికి గొప్ప పదవి రానున్నదనియు చెప్పెను. ఆమెయు ఒప్పు కొని తండ్రియనుమతి లేకయే బాలుని దేవచం ద్రుని వెంట పంపివేసెను. ఆచార్యుఁడు చంగదేవుని కరునావతియను నగరమునకు తన మఠమునకు కొని పోయెను.

చంగదేవునితండ్రి యింటికి వచ్చెను. బాలుఁడు ఇంట లేఁడు. భార్య చెప్పగా విని ఆగ్రహపడి బాలుని చూచువరకును భోజనముచేయనని ఒట్టుపెట్టుకొని బాలుని వెదకుకొని పోయెను. కరునావతికి పోయి దేవ చంద్రుని చూచి, బాలుని వెదకుకొని, తనవెంట పంపి వేయుమని దేవచంద్రు నడిగెను. కరునావతిలో ఉద యనమంత్రియని ప్రసిద్ధుఁడు రాజమంత్రి యుండెను. ఉద యనుఁడు ఎట్లో ఆ కోమటికి మాయోపాయములచే బోధించి బాలుని జైనాచార్యుని శిష్యుని చేయుటకు ఒప్పించెను. అతఁడు తన క్రోధమంతయు మఱచి ఒప్పు కొని బాలుని వదలి తన యూరికి పోయెను.

చంగదేవుఁడు జైనమత మవలంబించి హేమచం ద్రుఁడని నామాంతరము గ్రహించెను. చక్కగా సకల విద్యలను సర్వమత రహస్యములను గ్రహించి సూరిబిరు దము వహించెను. క్రమముగా ప్రసిద్ధుఁడాయెను. జిన దేవుని మీఁద పెక్కుశ్లోకములను వ్రాసెను. అభిధాన చింతామణి, దేశీ నామమాల, అనేకార్థమాల, ఛందోను శాసనము, ప్రాకృత శబ్దానుశాసనము, అలంకారచూడా మణి యను గ్రంథములను రచించెను.

౨

పశ్చిమసముద్రతీరమున స్తంభతీర్థ మని ప్రసిద్ధ జైన క్షేత్రము కలదు. హేమచంద్రసూరి అచట ఆచార్యపీఠము నధిష్ఠించెను. ఆయనమాటకు అడ్డులేదు, ఆజ్ఞకు తిరుగులేదు. జైనమత రహస్యములను బోధించి ఆయన అనేకులను జైనమతస్థులనుగా చేయుచుండెను. జైనులకు ఆయనయందు భక్తిశ్రద్ధలు హెచ్చుగా నుండెను; ఇంకను హెచ్చుచునే యుండినవి.

ఒకదినము ఆచార్యుఁడు ఉదయనమంత్రి యింట నుండెను. మధ్యాహ్నకాలమున నెవఁడో బాటసారి కడుదూరము నడచివచ్చుటచే అలసినవాఁడు ఉదయనుని భోజన మడిగెను. ఉదయనుఁడు అతనిని స్నానముచేసి రమ్మనెను. స్నానము చేసివచ్చి అతిథి ఆచార్యునికి నమస్కరించెను. ఆగంతుకుని చూచుచునే ఆచార్యుఁడు ఉదయనునితో "ఈతనియందు రాజలక్షణములు కనఁబడుచున్నవి. ఇతఁడు తప్పక రాజు కాఁగలఁడు" అని పలికెను.

అతిథి ఆశ్చర్యపడెను; ఆచార్యునిమాటలను నమ్మలేకయుండెను. వెంటనే ఆచార్యుఁడు రెండు తాళపత్రములను తీసికొని వానిమీఁద నొకే విషయమును రెండు ప్రతులు వ్రాసి ఒకటి అతిథి చేతికిని రెండవదానిని ఉదయనమంత్రిచేతికిని ఇచ్చి చదువుకొమ్మనెను. అం దిట్లుండెను—

"౧౧౯౯ (విక్రమ) సంవత్సరము కార్తికమాసమున కృష్ణపక్షమున చంద్రుఁడు హస్తయం దుండఁగా ఆదివారమునాఁడు నీకు మకుటాభిషేకము జరుగనిచో అదిమొదలు నేను నిమిత్తజ్యోతిషమును చెప్పుట మానుకొనెదను."

ఆచార్యుఁడు: దీనిని మీకడ నుంచుకొని పరీక్షచూచుకొనుఁడు.

అతిథియు మంత్రియు ఆచార్యుల జ్యోతిష ఫలము నెదురుచూడ నిశ్చయించుకొనిరి. ఆచార్యుఁ డు ఆగంతుకుని చూచి 'అబ్బాయీ, నీవు రాజవైన వెంటనే, నా వాక్కు సిద్ధింపగానే, నా మత మవలంబింపవలయును సుమా' అని హెచ్చరించెను. ఆగంతుకుఁడు నమస్కారపూర్వకముగా నొప్పుకొని తన చరిత్రమును ఆచార్యునకు ఇట్లు నివేదించెను.

౩

అణహిల్లపురమును భీమదేవుఁడు పాలించుచుండెను. అతనికి ఉదయమతి యని భార్యయు చౌలదేవి యని వేశ్యయు నుండిరి. ఉదయమతికి కర్ణుఁడును వానికి సిద్ధరాజును జనించిరి. చౌలదేవిమీఁది యనురాగముచే రాజు ఆమెను అంతఃపురములో చేర్చుకొనెను. ఆమెకు హరిపాలుఁడు, వానికి కుమారపాలుఁడు, వానికి త్రిభువనపాలుఁడను, వానికి కుమారపాలుఁడును జనించిరి. ఈ యాగంతుకుఁడే ఈకడపటికుమారపాలుఁడు. జ్యోతిషికులు కుమారపాలుని జాతకమును చూచి అప్పటి పాలకుఁడగు సిద్ధరాజువెనుక నీతఁడు రాజగునని చెప్పిరి. క్షత్రియాపుత్రుఁడును పాలకుఁడు నగు నారాజు అక్షత్రియాపుత్రుఁడని కుమారపాలుని గర్హించుచుండెను; వధించుటకు సయికైన సమయము వేచియుండెను. కుమారపాలుఁడు కొంతకాలము దాగియుండెను; సన్న్యాసులలో చేరి దేశములు తిరుగుచుండెను.

ఒకప్పుడు కుమారపాలుఁడు రాజధానికి చాటుగా వచ్చి సన్న్యాసుల మఠములలో నొకదానియందు దాగియుండెను. ఇట్లుండఁగా నొకదినము సిద్ధరాజు తండ్రి శ్రాద్ధదినము వచ్చినది. ఆ దినము రాజు అనేకులకు సన్న్యాసులకు పూజచేయ నెంచి ఆహ్వానించెను. కుమారపాలుఁడును తప్పనిసరిగా పోవలసివచ్చెను. సిద్ధరాజు సన్న్యాసుల పాదములు కడుగుచు, కుమారపాలుని పాదములను చూచి లక్షణములచే వెంటనే ఆనవాలు పట్టెను. కుమారపాలుఁడును ఆతని ముఖవికారముచే అభిప్రాయమును గ్రహించి సందుచూచుకొని పాఱిపోఁదొడఁగెను. సిద్ధరాజు భటులు తఱుమఁగా మొదట నొక కుమ్మరివాని యింటను, వెనుక నొక సేద్యగాని తోటలో పొదవెనుకను దాగియుండి వారిని తప్పించుకొని మరల పోసాఁగెను.

చేత దమ్మిడీ లేక, అరచేత ప్రాణ ముంచుకొని యాతఁడు పోవుచుండెను. మార్గమందొకచోట ఎలుక యొకటి తన కలుగునుండి ఇరువదియొక్క బంగారు నాణెములను ఒకటొకటిగా వెలికి దెచ్చుచుండఁగా చూచెను. వెనుక నా యెలుక వానియం దొకదానిని లోనికి కొనిపోయినది. వెంటనే కుమారపాలుఁడు ఆ మిగిలిన ఇరువది నాణెములను అపహరించెను. పాపము! ఆయెలుక ఆ నాణెములకై వెదకి ఆతఁడు చూచుచుండగా ప్రాణము వదలెను. కుమారపాలుఁడు తన పనికి చాల దుఃఖించి, దారిబత్తెము సంపాదించుకొన్నవాఁడై, మరల తన దారిని పోసాఁగెను.

మూఁడుదినములు అడవిమార్గమున అన్నపాన ములు లేక ప్రయాణము చేసినవెనుక ఆతనికి గొప్పపరి వారముతో తండ్రియింటికి పోవుచున్న స్త్రీ యొకతె కనఁబడినది. ఆతనియందు దయగొని యామె యన్నపా నాదులచే నాతనిని సేదదేర్చి వెంట గొనిపోయినది. ఈ విధముగా ప్రయాణముచేసి ఆమెను వదలి యాతఁడు స్తంభతీర్థమునకు వచ్చినాఁడు; హేమచంద్రసూరిని దర్శించినాఁడు.

౪

ఉదయనమంత్రి కుమారపాలుని సత్కరించి కావల సిన పరికరములతో మాళవమునకు పంపించెను. కుమార పాలుఁడు ఆచార్యవర్యుని చీటిలోని ప్రతిజ్ఞను చూచు కొనుచు, ధ్యానించుచు, మాళవములో కుడంగేశ్వర స్వామి యాలయమును ప్రవేశించెను. అచట భగవంతుని దర్శించి గోడలలోని చిత్రములు చూచుచు వచ్చుచుం డఁగా నొకగోడమీఁద శాసనములమధ్య నొకచోట తన పే రగుపడినది. వెంటనే ఆతఁడు చదువగా నా శాసన మం దిట్లుండెను :

" పుణ్యే వర్షసహస్రే శతే వర్షాణాం నవనవత్యధికే భవతి కుమారపాల నరేంద్రస్తవ విక్రమరాజ సదృశః. "

" వేయియు నూటతొంబది తొమ్మిది (విక్రమ) సంవత్సర పుణ్యకాలమున ఓ విక్రమమహారాజా ! నీకు సదృశుఁడు కుమారపాలుఁడని నరేంద్రుఁడు కలుగును. "

కుమారపాలుఁడు దీనిని చూచి ఆశ్చర్యపడెను. ఆచార్యుల ఆదేశమును ఈ శాసనమును ఒకేవిషయ మును చెప్పుచున్నవి.

ఈ లోపల అణహిల్ల నగరమున సిద్ధరాజు మర ణించెను. వెంటనే కుమారపాలుఁడు అణహిల్లనగరము నకు బయలుదేరెను. నగరమును రాత్రి ప్రవేశించెను. ఆకలిదప్పులచే కడు నలసియుండినందున అట నొక పూటకూటియింట భోజనముచేసి రాత్రి యటనే గడపి వేకువను అటనుండి తన యక్కయింటికి పోయెను. ఈతని బావ కంహడదేవుఁడు అణహిల్లపురమున ప్రధాన మంత్రిగా నుండెను. సిద్ధరాజుకు సంతానము లేదు. తనవెనుక యోగ్యు నొకనిని రాజకులమునుండి నియమిం పవలసినదని మంత్రి కేర్పాటుచేసి యాతఁడు గతించెను.

కంహడదేవుఁడు కుమారపాలుని చేరదీసి మరు నాఁడు తన వెంట ఆస్థానికి కొనిపోయెను. ఇంకను కంహడదేవుఁడు రాజును నియమింపలేదు. నాఁడు ఆపని కావలసియుండెను. కొలువుకూటమున ఉద్యో గస్థులందఱును వచ్చియుండిరి. మంత్రి ఎల్లవారి యెదు టను తొలుత రాజబంధువు నొకనిని సింహాసనాసీనుని చేసెను. ఈ రాజబంధువు చేతగానివానివలె నుండెను. చక్కగా నిలువనైన లేదు; పడిపోవుచున్న తన యుంగ వస్త్రమును చక్కదిద్దుకొననైన లేదు. వికారముగా నుండెను. శకునజ్ఞులు వానిని మాని మఱియొకనిని కూర్చుండబెట్టు మనిరి. ఈరెండవవాఁడు పయికొము పిఱికివానివలె సింహాసనము మీఁద నొదిగి చేతులు జోడించుకొని కూర్చుండెను. సభలోని పెద్దలు అడిగిరి, "ఏలినవారు ఏవిధముగా నీ పదునెనిమిది రాష్ట్రములను పాలింప నెంచియున్నారు." అని. "మీవంటి పెద్దల యాజ్ఞలకును ఆలోచనలకును లోబడియే గదా" అని ఆతఁడు బదులుపలికెను. "ఇతఁడు కేవలము మృదువు; పనికిరాఁడు." అని వానిని మాని కుమారపాలుని రాజ బంధువు కాన కూర్చుండు మనిరి. వెంటనే యాతఁడు ఠీవితో సింహాసనము నధిష్ఠించెను. ఆతని గాంభీర్యము నకును కత్తిని ధరించిన సౌరునకును ఎల్లవారును హర్షిం చిరి. మరల నీతనిని ఆ ప్రశ్నయే మంత్రులు వేసిరి,

తటాలున కుమారపాలుఁడు ఒరనుండి కత్తిదూసి సభయంతయు ఉఱిమిచూచినాఁడు. సభయంతయు సంతోషించినది. వెంటనే కుమారపాలుని పట్టాభిషేకము జరిగినది; సూరివర్యుని జ్యోతిషము ఫలించినది.

కుమారపాలునికి ఏబదియైదు సంవత్సరములు. బాల్యమునుండియు కష్టముల ననుభవించి విదేశములు తిరిగియుండుటచే చక్కని యనుభవ మేర్పడియుండెను. రాజ్యము చేతికి వచ్చినంతనే యాతఁడు స్వతంత్రపాలన మారంభించెను. మంత్రులలో అసహన మారంభమాయెను. కొందఱు మంత్రులు కుమారపాలుని చంపనెంచి, ఆతఁడు అంతఃపురమున కొక చీకటిమార్గమున పోవుచుండఁగా చంపివేయుఁడని ఘాతుకులకు ఆజ్ఞయిచ్చిరి. ఎవరో తెలుపఁగా కుమారపాలుఁడు వారిని చంపివేసెను.

కుమారపాలుఁడు రాజ్యమందు చక్కఁగా కుదురుకొనెను. వెంటనే నాఁడు తాను పాఱిపోవుచుండగా తన్ను కాపాడిన యా కుమ్మరివానికి ఏడువందల గ్రామములనిచ్చి బహుమానించెను. ఆ సేద్యగానిని కూడ అట్లే సన్మానించెను. స్తంభతీర్థమున తనకు సాయముచేసిన ఉదయనమంత్రికుమారుని ప్రధానమంత్రిగా చేసికొనెను.

దిగ్విజయ మారంభించెను. మాళవము, కొంకణము, శ్రీనగరము, కంచి, త్రైలింగము మొదలగు దేశములను జయించెను. ఆర్యావర్తమందలి రాజులు తమంతనే ఆతనికి మ్రొక్కిరి. కాశీపతి స్వయముగానే వచ్చి కుమారపాలునికి పరిచర్య చేయసాఁగెను; మగధరాజు గొప్ప మణులను కానుకపంపెను; గౌడుఁడు ఏనుఁగుల నిచ్చెను. దశార్ణకన్యాకుబ్జేశ్వరులు దేశములనే త్యజించి పాఱిపోయిరి. కుమారపాలమహారాజు చక్రవర్తి యాయెను.

కుమారపాలుఁడు మాళవములో నుండఁగా హేమచంద్రసూరి దర్శనమునకు వచ్చెను. ఆయనవెంట ఉదయనమంత్రియు వచ్చి సూరివర్యుని నాటి పరిచితునిగా నెఱింగించెను. ఆచార్యుఁడు చక్రవర్తి తనకు నాఁడు చేసిన ప్రమాణమును చెల్లింపుమని యడుగలేదు; మఱి తనతల్లి మరణించినదనియు తా నామెకర్మలను చేయుచుండఁగా శైవులు హిందువులు బాధించిరనియు, తన మతమునకు రక్షణ వలయుననియు కోరెను. కుమారపాలచక్రవర్తి నాఁడు తనకు స్తంభతీర్థమున జ్యోతిషము చెప్పిన గురువును, ఆయనకు తానుచేసిన వాగ్దానమును స్మరణకు తెచ్చుకొని వెంటనే సూరివర్యుని ఆదరించెను.

※

ఆస్థానమందలి బ్రాహ్మణులు జైనాచార్యునికి కలుగుచున్న పేరుప్రతిష్ఠలకును, రాజానుగ్రహమునకును ఓర్వలేకపోయిరి. ఎట్లయినను ఆతనిపతనమునే కోరుచు నిందలను మోప మొదలిడిరి.

హేమచంద్రసూరి ఎంతపండితుఁడో అంతగొప్ప మతప్రవక్తయో అంతలౌకికుఁడు, మంచివక్త, సభారంజకుఁడు, ఉపాయముల నెఱిఁగినవాఁడు, సమయోచితముగా ప్రవర్తింపఁ గలిగినవాఁడు, కార్యసాధకుఁడు. రాజు ఆతని మాటలతీరునకే సగము ముగ్ధుఁడగుచుండెను. కొందఱు కవులు 'చంద్రుని ప్రకాశమును చూచి సముద్రుఁడు సంతోషముచే పొంగినట్లు కుమారపాలమహారాజు హేమచంద్రుని మాటలకు ఉప్పొంగుచున్నాఁడు' అని సయితము వర్ణించిరి.

ఒకప్పుడు బ్రాహ్మణులు రాజుతో, హేమాచార్యుఁడు పరమపామరుఁడనియు, సూర్యోపాసన చేయఁడనియు, ప్రత్యక్షదైవమునే ఒల్లఁడనియు చెప్పిరి. రాజు ఆచార్యుని "ఇదేమి నిజమా?" అని యడిగెను.

ఆచార్యుఁడు 'ఎంతమాత్రముకాదు. ఈ తేజఃపుంజమును నేను నిరంతరము నా హృదయమున ధ్యానించుచున్నాను. ఇదికనఁబడనిచో నేను భోజనము చేయను. దీని యస్తమయకాలమున అన్నాహారములను వర్జించెదను గదా' అనెను.

సూరివర్యుఁడు సాధుమార్గమవలంబించి హిందూ బౌద్ధ ధర్మశాస్త్రములను సయితము ఉదాహరించుచు తనకు హిందూ జైన బౌద్ధ మతములయందు సమాన గౌరవము కలదని చెప్పుచు 'అన్యులమనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుకు' తిరుగుచుండెను. ఈతని

అండఁజూచుకొని జైనులు మరల తలయెత్తుకొని తిరుగ సాగిరి.

కుమారపాలుఁడొకప్పుడు ధర్మకార్యమేదైనను చేయ సంకల్పించి ఆచార్యుని అడిగెను, 'ఏధర్మకార్యము మీఁద ధనము వ్యయింపవచ్చును" అని. కుమారపాలుఁడు అప్పటి కింకను జైనుఁడు కాలేదు. అతఁడే స్వయముగా జైనుఁడగుట మంచిదని ఆచార్యుఁడును తగినట్లు వర్తించుచుండెను. "ప్రభాసపట్టణమున సోమనాథతీర్థమును శివక్షేత్రమును మ్లేచ్ఛులు పాడుచేసిరి గదా. దానిని మరల ప్రతిష్ఠింపుము." అని ఆచార్యుఁడు చెప్పెను. వెంటనే రాజు సోమనాథతీర్థమునకు ఉద్యోగస్థులను పంపి ఆలయనిర్మాణమును ప్రారంభించెను. కొంతకాలమునకు ఆలయమునకు పునాదులు లేచినవనియు, నిర్మాణము చక్కఁగా కొనసాగుచున్నదనియు వార్త వచ్చినది. రాజు ఆచార్యుని అడిగెను. "స్వామీ ఈ కార్యము అంతరాయములేక జరుగుట కేమి ఉపాయము?" ఆచార్యుఁడు "ఈ కార్యము ముగియువఱకు స్త్రీ స్పర్శచేయనని వ్రతము పూనుము లేదా మాంసాహారమును అంతవఱకును మానివేయుము" అనెను. వెంటనే రాజు శివలింగమునకు అభిషేకముచేసి అట్లే రెండవప్రమాణమును చేసికొనెను.

రెండు సంవత్సరములు గడచినవి. సోమేశ్వరాలయ గోపురము సయితము తయారైనది. కలశముల నుంచుటయే కొదువ. రాజు ఆచార్యునితో తాను వ్రతమును సమాప్తిచేసెద ననెను. ఆచార్యుఁడు వల దనెను. "ఈ వ్రతముతోనే నీవు మహాదేవుని దర్శనము చేయుట బాగు. గోపురదర్శనమైనవెంటనే నీవు వ్రతమును మానుకొనవచ్చును." అనెను.

బ్రాహ్మణులు, ఆచార్యుని పరీక్షించుటకు ఇదే సమయ మని తలంచి, "ఇతఁడు జైనుఁడు గదా, సోమనాథపురమునకు రాఁడు. ఆలయములో ప్రవేశింపనేప్రవేశింపఁడు. పైగా ఈశ్వరలింగమునకు ఎంతమాత్రము మ్రొక్కఁడు. అంతయు నటన. లోతుపాటి మనుష్యుఁడు. వీనిని చక్కఁగా ఇప్పుడే పరీక్షింపవలసినది. మర్మము బయటపడును" అని రాజుతో తంటగొట్టిరి. రాజు ఆచార్యుని తమ వెంట రమ్మనెను. ఆచార్యుఁడు, "ఇది నాకు చెప్పవలెనా? మీకన్న ముందే సోమనాథుని అర్ధేందుమౌళిని దర్శించుటకు నేను సిద్ధముగా నున్నాను." అనెను. ఆచార్యుఁడు ద్వారక, శత్రుంజయము మొదలైన క్షేత్రములను నడచిపోయియే దర్శించి దేవపట్టణమున కుమారపాలుని కలసికొనవలయునని రాజు ఏర్పాటుచేసెను. అన్నిటికిని హేమచంద్రుఁడు సరియే యనెను. ఏ యుపాయముననైనను ఆతనిని పట్టుటకు శైవులకు సాధ్యముకాలేదు.

ప్రయాణము లారంభములైనవి. రాజు గొప్ప పరివారముతో ప్రభాసపట్టణమును ప్రవేశించెను. ఆలయ పూజాధికారి బృహస్పతియను బ్రాహ్మణుఁడు ఎదురుపోయి రాజును పిలుచుకొనిపోయెను. హేమచంద్రసూరియు తీర్థములు తిరిగి రాజును అచట కలసికొనెను. ఎల్లవారును భజనతో ఆలయమును ప్రవేశించిరి. కుమారపాలుఁడు భగవంతుని లింగమునకు సాష్టాంగముగా మ్రొక్కెను.

హేమచంద్రసూరియు ఆలయములో ప్రవేశించుచు గర్భగృహముగడపకడ నిలిచి "దేవదేవుఁడు, కైలాసనాథుఁడు, ఇదుగో ఇచ్చట సాక్షాత్తుగా వెలసియున్నాఁడు." అని లోపలికివచ్చి ఆగమోక్తప్రకారము శివలింగమును పూజించి ఎల్లవారియెదుటను భగవంతుని ఇట్లని: స్తుతించెను. "దేవా, భగవంతుఁడా, నీకొకస్థలము లేదు. నీకొకవేళ లేదు. నీకొక పేరులేదు. నీవు ఎల్లయెడలను కలవు. నీలో ఎట్టిదోషమును లేదు; నిన్ను ఎట్టి దోషమును చెందదు. నీవు-భగవంతుఁడవు-ఒక్కఁడవే. నీకు నమస్కారము. భవపాశములను ఆశలను త్రుంచినవాఁడవు నీవు, బ్రహ్మవగుదువో, విష్ణువగుదువో, శివుఁడవగుదువో, ఎవరవైన నగుదువుగాక, ఎవరైననేమి,- భగవంతుఁడవు. నీకునమస్కారము." సూరివర్యుఁడు ఈ విధముగా చెప్పుచుండఁగా రాజు మంత్రులు ఇతరమతములవారు అందఱును ఆశ్చర్యపడి ఆతనిని చూచుచుండిరి. తటాలున ఆచార్య హేమచంద్రుఁడు లింగమునకు

సాష్టాంగముగా నమస్కరించెను. ఆచార్యుని మాటల ద్వంద్వార్థమును వారు పరికింపలేదు.

అనంతరము రాజు బృహస్పతి సాయముతో భగవంతుని అర్చించి తనయెత్తు బంగారమును ఎల్లవారికిని పంచిపెట్టెను; ఏనుఁగులను దానముచేసెను. వెనుక భగవంతునికి హారతియెత్తిరి. అంతయు ముగియగానే రాజు ఎల్లవారిని పంపివేసి తాను ఆచార్యునితో గర్భగృహమును ప్రవేశించెను. తలుపు గడియవైచికొనెను.

రాజడిగెను: ఇన్నిమతము లున్నవిగదా వీనిలో స్థిరమును సత్యము నైనదానిని స్థాపింపఁ గలయునని నా యుద్దేశము. సోమేశ్వరునివంటి దైవము లేదు; నావంటి రాజు లేఁడు. నీవంటి ఆచార్యుఁడు లేఁడు. నా యదృష్టముచేత అన్నియు సమకూడినవి. మహాత్మా, చెప్పుము ఈ దేవుని ఎదుట నీ సత్యవాక్కులచేత మోక్షమునొసగు సత్యమార్గమును.

సూరివర్యునికి సమయము దొరకినది. "పురాణోక్త విషయములు మనకు అప్రసక్తములు. ఈ సోమేశ్వరుఁడే మనకు ప్రత్యక్షము కాఁగలఁడు. ఆయనవాక్కే నీవు వినగలవు. నిస్సందేహముగా నీ ప్రదేశముననే దేవుఁడు నెలసియున్నాఁడు. నే నిట కూర్చుండి జపమారంభించెదను. రాజా! నీవు ధూపము వేయుచుండుము. త్రినేత్రుఁడు భగవంతుఁడు స్వయముగా వచ్చి నిన్ను నివారించును. కానీ మాడు" అనెను.

ఇరువురును ఉపక్రమించిరి. హేమచంద్రుఁడు ధ్యానమున మునిఁగినాఁడు; కుమారపాలుఁడు ధూపముచే గది నింపినాఁడు. కొన్ని నిముషములు గడచినవి. తటాలున మూలస్థానమునుండి జ్యోతి యొకటి యావిర్భవించినది. రాజు తటాలున లేచి వెఱఁగుపడి చూడలేక కన్నులు మూసికొని కష్టముమీఁద తెఱచినాఁడు. మూలస్థానమున త్రినేత్రుఁడే సాక్షాత్తుగా కనఁబడుచున్నాఁడు. ఆప్రకాశమును కుమారపాలుఁడు చూడలేకపోయినాఁడు; పోయిన తెలివిని ఎట్లో తెచ్చుకొని సాగిలఁబడి భగవంతుని స్తుతింపసాగినాఁడు "లోకాలోకేశ్వరా, నిన్ను పూజించుటచే నాకన్నులు తనిసినవి. కాంక్షితమును గంటిని. ప్రభూ, నీయాజ్ఞకు బద్ధుఁడను. ఏదైనను అనుగ్రహింపుము. నానేత్రములను తనిపితివి. నాచెవులకు పండువుసేయుము." అనెను.

భగవంతుని మొగము మఱింత చక్కఁగా ప్రకాశించినది. వెంటనే ఈవాక్యములు గర్భగృహమునుండి వినఁబడినవి. "ఓయి, రాజా! ఈ హేమచంద్రుఁడు ఎల్ల దేవతల యవతారముసుమా. ఈతనివాక్యములు సత్యములు. ఈతనియందు ఎంతమాత్రము కపటము లేదు. ఈతని నాశ్రయింపుము. ఇతఁడు నీకు మోక్షమార్గమును బోధించును. భూత భవిష్య ద్వర్తమానముల నెఱిఁగిన జ్ఞాని సుమా యితఁడు ఎల్లరహస్యములును ఈతనికి కరతలామలకములు. ఈతనిని చక్కగా ఉపాసింపుము. నీకు మేలు కలుగును." అని పలికి భగవంతుఁడు అంతర్ధానమాయెను.

౬

రాజును ఆచార్యుఁడును అణహిల్ల నగరమునకు వచ్చిరి. కుమారపాలుఁడు సూరివర్యునకు శిష్యుఁడాయెను. ఆచార్యుఁడు అతనికి జైనమత రహస్యములను బోధించెను. నాటినుండియు కుమారపాలుఁడు జైనుఁడు. ఆచార్యుని యుద్దేశము నెఱవేరినది. ఆచార్యుని యాజ్ఞమీఁద రాజు తన రాజ్యములో పదునాలుగేండ్లు పదునెనిమిది రాష్ట్రములలోను ప్రాణివధ జరుగకూడదని శాసించెను. జైనమత ధర్మములను పాటింపవలయునని అనుశాసించెను. యజ్ఞయాగాదులలో బ్రాహ్మణులు పశుబలికి బదులు పిండివంటకముల నుపయోగింపసాగిరి. పల్లెలలో సయితము రాజశాసనమును ఎల్లవారును పాటించుటచే కృష్ణాజినము దొరకదయ్యెను. విశేష మాంసభోజనులు పాంచాలురు రాజశాసనమునకు వెఱచి యూరకుండిరి. మాంసవిక్రేతల వ్యాపారములు సన్నగిల్లినవి. వారికై రాజు వారి పదునాలుగేండ్ల యాదాయముపాటి ధనమును ఉచితముగా నొసంగెను. కాని కాశీప్రాంత్యపు ప్రజలు మాత్రము యథాపూర్వము ప్రాణివధ చేయుచునే యుండిరి. సనాతనులు జైనుల యైశ్వర్యము చూడలేకయు, ఈబాధలు పడలేకయు,

ఏమి చేయుటకును సాధ్యము కాకపోవుటచే సమయము కొఱకు వేచియుండిరి.

హేమచంద్రుని అధికారమే ఇప్పుడు సాగుట. కుమారపాలునిది కాదు. సోమనాథ దేవాలయారాధకుఁడు బృహస్పతియను నా బ్రాహ్మణుఁడు ఒకనాఁడు ఏదో సందర్భమున తన్నెఱుఁగక జైనమతమును దూషించెను. వెంటనే ఆచార్యుఁడు అతనిని అధికారమునుండి తొలఁగించెను. ఆ బ్రాహ్మణుఁడు భయపడి వెంటనే అణహిలపురమునకు పోయి ఆచార్యుని దర్శించి ఆయన పాదములలోపడి రాజునకు సిఫారసు చేయించుకొని మరల తన యుద్యోగమును తెచ్చుకొనెను.

హేమచంద్రుని అధికారము విశృంఖలముగా నుండెను.

౭

కుమారపాలుని రాజ్యమున నిది ముప్పదియవ సంవత్సరము. రాజునకు కుష్ఠరోగము తగిలెను. ఆకాలముననే సూరికర్యుఁడు, ఎనుఁబదియేండ్ల వృద్ధుఁడు, తనకు మృత్యు వాసన్నమైనదని తెలిసికొని నిరశనవ్రతమవలంబించి ప్రాణము త్యజింపనెంచెను. కుమారపాలుని చూచి "రాజా! నాకు మృత్యువాసన్నమగుచున్నది. నా వెనుక నీకు ఆఱునెలలకే ఆయువు ముగియును. నీ వేల నీ కృత్యములను ముగించుకొనరాదు" అని హెచ్చరించెను.

కుమారపాలుఁడు జైనమతమును రాజ్యమందు బలపఱచుటకై సనాతనమతావలంబకులను బ్రాహ్మణుల నందఱును తనరాజ్యము వదలిపొమ్మనెను. వారు తనరాజ్యమును వదలుటకు దినము నియమించి ఎదురు చూచుచుండెను. ఏమిచేయుటకును తోచక బ్రాహ్మణులు జగద్గురువునకు శంకరాచార్యునకు విన్నవించుకొనిరి. ఆయనయు అకస్మాత్తుగా ఆసమీప ప్రదేశమునకు వచ్చియుండెను. ఎట్లయినను ఆర్యమతమును నిలుపుఁడని ఆయనను బ్రాహ్మణులు వేడుకొనిరి.

ఆ మఱునాఁడే బ్రాహ్మణులు రాజ్యమును వదలవలసియుండెను. రాజు వారిని పిలిపించి "మీకు నేనిచ్చిన కాలము ముగిసినది. ఇక కాలము ఈయను. నా రాజ్యమును వదలుఁడు, లేదా జైనుని ఉపాసింపుఁడు. వేరు మార్గము లేదు." అనెను. వెంటనే శంకరాచార్యుఁడు ముందడుగుంచి "రాజా! అవసరపడకు. మనమందఱము కలసిరేపే, మొత్తముగానే రాజ్యమునేకాదు లోకమునే వదలి పోవచ్చును."అనెను.

రాజు: అదేమి?

శంకరుఁడు: తొమ్మిది గంటలకు జలప్రళయము రానున్నది. సముద్రముపొంగి లోకమునంతయు ముంగనున్నది. సృష్టియంతయు నీటిలో మునిఁగిపోవుచుండఁగా వీరిని మాత్రము పొమ్మనెదవేమి? ఏమియు నెఱుఁగవు గదా!

రాజునకు ఆశ్చర్యమును దిగులును కలిగినవి. వెంటనే తనగురువునకు చెప్పిపంపెను. ఆచార్యుఁడు రాగానే "స్వామీ! ఇదేమి. యుగాంతకాలము నేఁడే అగునా? ప్రళయమువచ్చునా?" అనియడిగెను. హేమాచార్యుఁడు నవ్వి "ఎంతమాత్రము కానేరదు. ఈ ప్రపంచమునకు నిర్మాత లేఁడు. దీనికి అంతమును లేదు. ప్రకృతి అనాది సిద్ధము." అని జైనమతసారము నుపదేశించెను. శంకరాచార్యుఁడు "జలయంత్రమును పెట్టి కాలము నెదురుచూడుఁడు,తొమ్మిదిగంటల కేమి జరుగునో చూతము."అనెను. అంతట ముప్వురుమగడియారముకడకూర్చుండి ప్రళయము నెదురుచూడసాఁగిరి. తొమ్మిదవగంటకొట్టగానే ముప్వురును మేడమీఁదికిపోయి కిటికీలకడనుండి చూడఁగా దూరమున సముద్రము పొంగివచ్చుచున్నట్లుండెను. క్రమముగా తరంగములు లేచివచ్చి నగరమంతయు క్రమ్మివేసినవి. వీథులు, జనము, ఇండ్లు, చెట్లు అన్నియు నీటిక్రిందికి పోదొడఁగినవి. రాజును, ఆయిరువురు ఆచార్యులును పైయంతస్తులోనికి పోయిరి. నీరు హెచ్చదొడంగినది. ఆ అంతస్తుసైతము మునుఁగ నారంభించినది. వారు పైకిపోవుకొలఁదియు నీరును పైకిరా నారంభించినది. క్రమముగా వారు ఏడవయంతస్తులోనికిపోయిరి. నలువైపుల చూచిరిగదా! గొప్పసౌధములును మహావృక్షములును మునిగిపోయినవి. వాని శిఖరములుసయితము మగ

పడవు. ఎటుచూచినను నీరే; మఱేమియు కనఁబడదు. దిగులుపడి కుమారపాలుఁడు శంకరాచార్యులను "స్వామీ, మఱిరేమిగతి? మార్గములేదా?" అని యడిగెను. "పడమటి దిక్కునుండి యొక చిన్నపడవ ఈవైపు రానున్నది. ముందుగా అందు దుముకువానికి ప్రాణము దక్కును." అని ఆచార్యుఁడు చెప్పెను. కొంతసేపటికి దూరమున పడమటనొక పడవ కనఁబడినది. అది క్రమముగా రాజమందిరమును సమీపించెను. ముగ్వురును నడుములు బిగించుకొనిరి. పడవ రాజమందిరమునకు చేరువగావచ్చి నిలిచినది. కుమారపాలుని శంకరుఁడు పట్టుకొని "మన మొకరొకరి సాయముచేత నిందులోనికి దుముకవలెను." అని పలికెను. కుమారపాలుఁడు అందులోనికి దుముకపోగా శంకరాచార్యుఁడు వెనుకకు పట్టిలాగెను. హేమచంద్రుఁడు దుమికెను.

అయ్యో! ఇకనేమున్నది? పడవలేదు, జలములేను, ఏమియులేదు. ఇండ్లు, వీథులు, చెట్లు, జనులు, సర్వమును మునుపటియట్లె చక్కగానున్నవి. సూరివర్యుఁడు అంతఎత్తునుండియు క్రింద రాతికట్టడము మీఁదపడి తలపగిలి మరణించెను.

"ఎలక్షన్లు"

ఎన్నికలకు సంబంధించిన యావద్విషయములు తెల్పు తెలుగు గ్రంథము

వెల రూ. **2-8-0**

శాసనసభల ఎన్నికలు, జిల్లాబోర్డుల మునిసిపాలిటీ పంచాయితీల ఎన్నికలున్ను, విశ్వాసరాహిత్య తీర్మానములున్ను, ఎలక్షను విచారణలును, ప్రెసిడెంటు-వైస్ ప్రెసిడెంటు ఎన్నికలు మున్నగు విషయములగూర్చి యిందు విపులముగా వ్రాయబడియున్నది.

గ్రంథకర్త: అవసరాల వెంకటనర్సు, బి. ఏ, బి. యల్., వకీలు

ఓటరుజాబితాలు మొదలు మెంబరు ఎన్నిక పూర్తియగువరకు అమలులో పెట్టు న్యాయశాస్త్రవిధాన మంతయు నీగ్రంథమున సలక్షణశైలిని విశదీకరింపబడియున్నది.

ఆంధ్రగ్రంథమాల, 7, తంబుచెట్టి వీథి, మద్రాసు.